# కీటకములు మరియు సాలెపురుగులు

- వాసంతి మాఘపు.

(గత సంచిక తరువాయి భాగం)

## రుచిని తెలియజేసే గ్రహణేంద్రియము పాదములలో!

మనలో చాలామంది అవతలివారిని హేళనచేస్తూ, 'మెదడు మోకాళ్ళలో ఉన్నదని' అనడం పరిపాటి. కాని సీతాకోకచిలుకలు, ఈగలు, తేనెటీగలకు రుచిని తెలియజేసే గ్రహణేంద్రియములు పాదాలలో ఉంటాయి. ఇది నూటికి నూరుపాళ్ళు నిజం! సీతాకోకచిలుకలు గ్రుడ్లు పెట్టేముందు, ఆ మొక్కలను తన నాలుక, మీసములతో - గ్రుడ్లనుండి వచ్చే గొంగళిపురుగులకు తగిన ఆహారమో కాదో - తనిఖీ చేసిన తరువాతే గ్రుడ్లు పెడుతుంది. తన కాళ్ళతో ఆకుల రుచిని పరిక్షించిన పిదపే అది నిర్ణయం తీసుకుంటుంది. ఆశ్చర్యంగా లేదూ!

## ప్రత్యక్షనాటకం!

ఒక రకమైన కుమ్మరపురుగు (పేడపురుగు) తన శత్రువులను మోసం చెయ్యడానికి వాటి వీపుపై పడిఉండి, చచ్చినవానివలే నటించును. అకస్మాత్తుగా అవి ఎగిరి, వాటి కాళ్ళపై నిలిచి, శత్రువు తేరుకునేలోపు పారిపోతాయి.

## కోటివిద్యలు కూటికొఱకే!

మనకు తెలిసి చాలా రకముల సాలెపురుగులు పట్టుదారాన్ని గూడు అల్లడానికి, క్రిమి కీటకాలను బంధించడానికి ఉపయోగిస్తాయి. కాని ఒక రకమైన సాలెపురుగు (స్పిట్టింగ్ సాలెపురుగు) తన కోఱలనుండి విషపూరితమైన, జిగురు వంటి అంటుకునే పదార్థాన్ని తన ఎర్రపైకి వెదజల్లి దానిని ఆరగిస్తుంది.

## ప్రేమ - పెళ్ళి

రాణి చీమలు వాటి భాగస్వామిని ఎన్నుకున్న పిదప, వాటి రెక్కలను త్యజిస్తాయి. అక్కడినుండి వాటికి గ్రుడ్లను పట్టడమే పని. వాటికి ఇక రెక్కలతో అవసరం ఉండదు కదా! ఇది కొంతవరకు మనుషులకు వర్తిస్తుందేమో! ఈ రోజులలో ప్రేమికులని చెప్పబడే చాలామంది, ప్రేమలో ఉన్నన్నాళ్ళూ గాలిలో తేలిపోతూ ఉంటారు - పెళ్ళి అయ్యేవరకూ. పెళ్ళి కాగానే వారు నేలపైకి (వాస్తవానికి దగ్గరగా) వస్తారు. ఎప్పుడూ గాలిలో తేలిపోతూ, బ్రహ్మానందముతో ఉండేవారు అదృష్టవంతులు కదా!

- *విజ్ఞానం, ఆనందం, ప్రేమ పంచేకొద్దీ పెరుగుతాయి.*
- *కష్టాలలో ఉన్నప్పుడే అసలైన స్నేహితులు బయటపడతారు.*

## తేనెకుండ (హనీపాట్) చీమలు!

మీకందరికీ తెలిసే ఉంటుంది 'ఒంటె చాలా రోజులకు సరిపోయే నీటిని తన శరీరంలో దాచుకుంటుందని'. అలాగే కొన్ని పనిచీమలు (వర్కర్ ఏంట్స్), ఎక్కువగా పువ్వులు వికసించే సమయములో, పూతేనెను తమ శరీరంలో నిలువచేస్తాయి. ఈ పూతేనెతో నింపబడడం వలన అవి లావుగా, కదలలేనంతగా పెరిగిపోతాయి. పని వత్తిడి తగ్గిన తరువాత వాటిలో మకరందాన్ని తగిన విధముగా స్వీకరించి, పొందుపరచడం జరుగుతుంది.

## కండబలం!

వానపాములకు (ఎర్త్ వార్మ్స్) కాళ్ళు ఉండవు. పాదములు ఉండవు. ఎముకలు అసలే లేవు. అయినా వాటి మృదువైన శరీరపు నిర్మాణము మట్టిగుండా చొచ్చుకొని పోడానికి అనువుగా ఉంటుంది. అవి తమ కండరాలను సాగదీయడము వలన, కుదించుకోవడము వలన ముందుకు పోగలవు.

## మినుగురు పురుగులు ఆకాశానికి వెలుగునెలా ఇస్తాయి?

మగ మిణుగురు పురుగులు, వాటి శరీరములో ఉన్న రసాయణములవలన, కాంతిని వెదజల్లుతూ తమ భాగస్వామిని వెదకుతాయి. ఆడ మిణుగురు పురుగులు ఎగరలేవు. కాని, కాంతిని వెదజల్లుతూ, తద్వారా మగ మిణుగురు పురుగులను ఆకర్షిస్తాయి.

## రెక్కలపురుగు (మోత్) - సీతాకోకచిలుక

సీతాకోకచిలుకలు పగలు ఎగురుతాయి. ఇవి చాలా ప్రకాశవంతమైన రంగులు కలిగి ఉంటాయి. వీటి మీసములు చివర వృత్తాకారముగా వంగి ఉంటాయి. రెక్కలపురుగులు (మోత్) రాత్రి సమయములో ఎగురుతుంటాయి. వీటి మీసములపై నూగు (సన్నని వెంట్రుకల మాదిరిగా) కలిగి ఉంటాయి.

*** *** ***

## ఇది ముమ్మాటికీ నిజం!

- స్వామీజీల, పరమహంసల, బాబాజీల పాదధూళిని నెత్తిన జల్లుకోడానికి ప్రాకులాడేవారికంటే, వారి బోధనలలోని ఒక్కవిషయాన్నైనా తలకెక్కించుకొనేవారు ధన్యులు.
- శరీరమంతా చిల్లులు పడ్డ ఈ శరీరంలోని (అస్థి పంజరంలో) ప్రాణం (పక్షి ఎగిరి) పోతే ఆశ్చర్యం ఏముంది. ప్రాణం (పక్షి) ఉన్నందుకు మనము ప్రతిక్షణమూ సృష్టి కర్తకు కృతజ్ఞతలు తెలియజేయాలి.
- రబ్బరు బుంగకి చిన్న రంధ్రమైనా గాలి పోతుంది. నవరంధ్రాలతో కూడిన ఈ మానవశరీరము ప్రాణవాయువుతో నిండి ఉండడం ఆశ్చర్యం కాదా!

***